

బోనం.. తెలంగాణ ప్రాణం

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో వైభవంగా బోనాల జాతర












శివసత్తుల ఆటలు... పోతురాజుల విన్యాసాలు.. పిల్లల కేరింతలు... పెద్దల మొక్కుల సమర్పణతో అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు ఉదయం నుంచే అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలు ఎత్తుకొని ఆలయాల వద్ద డప్పుచప్పుళ్ల మధ్య చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలన్నీ ఈ సందర్భంగా మహిళలతో కిటకిటలాడాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేరీతిలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ పోచమ్మ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ పోచమ్మ దేవాలయం మహిళలతో కిటకిటలాడింది. ఎటు చూసినా చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య బోనాల వేడుకలు ఘనంగా జరిగింది. ఆలయాల వద్ద కమిటీలు ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేయగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలోని వీధులన్నీ బోనాల పర్వదిన సందడితో కళకళాడాయి.

– బంజారాహిల్స్


ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయానికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన మహిళలు


బోనాల వేడుకల్లో మాజీ కార్పొరేటర్లు మురళీగౌడ్, సంజయ్‌గౌడ్ కుటుంబసభ్యులు


పూజల్లో విద్యాశాఖ సమగ్రశిక్ష డైరెక్టర్ పి.రాధారెడ్డి, డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి


బోనమెత్తిన మాజీ కార్పొరేటర్ మామిడి లక్ష్మీబాయి


ఇందిరానగర్ బస్తీలో... కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


బోనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే దానం సతీమణి


వెంకటేశ్వరనగర్ బస్తీలో బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్


సుఖ్‌దేవ్‌నగర్ బస్తీలో... కార్పొరేటర్ కవితారెడ్డి


ఇందిరానగర్‌లో బంజారాహిల్స్ సీఐ రాఘవేంద్రకు సన్మానం


బంజారాహిల్స్‌లో గిరిజన యువతి...


రోడ్ నెం. 12లో సెల్ఫీ తీసుకుంటూ...


ఇందిరానగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గంట మల్లేష్


ఎల్లారెడ్డిగూడ నల్లపోచమ్మ దేవాలయం వద్ద


బోనాల వేడుకల్లో మంత్రి పొన్నం, మేయర్


మహంకాళి దేవాలయంలో మహేష్‌కుమార్ గౌడ్


బంజారాహిల్స్ గాంధీపుర బస్తీలో...


పూజలు నిర్వహించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి


భూలక్ష్మమ్మ నల్లపోచమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు


వెంకటలక్ష్మి దేవాలయంలో ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ తదితరులు


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

శ్రీనివాస్ కావేటికి నెల్సన్ మండేలా అవార్డు


నెల్సన్ మండేలా అవార్డు అందుకున్న శ్రీనివాస్ కావేటి

హిమాయత్‌నగర్: అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ, అంతర్జాతీయ న్యాయ సంస్కరణలు, సామాజిక న్యాయ ఉద్యమాల్లో చేసిన విశేష కృషికి గాను నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ డే సందర్భంగా కావేటి లా ఇంటర్నేషనల్ ప్రధాన భాగస్వామి, ప్రముఖ అంతర్జాతీయ న్యాయవాది డా.శ్రీనివాస్ కావేటి ప్రతిష్టాత్మక నెల్సన్ మండేలా అవార్డును ఆక్స్ ఫర్డ్ మేయర్ లుబ్నా అర్షద్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో యూకేలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యాక్తం చేశారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి చొరవ చూపాలి


నియామక పత్రం అందజేస్తున్న శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని రాష్ట్ర కార్యాలయంలో మహాసభ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడిగా తెలుగు వెంకటేశ్వర్ తోపాటు రాష్ట్ర కార్యదర్శిగా జలగరి అశోక్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. నాయకులు శైలేంద్ర శివయ్య, డా.మద్దెల సంతోష్, మణిక్యాల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో నటుడు హర్షవర్ధన్ సందడి


సామ్‌సంగ్ జెడ్ ఫోల్డ్ ఫోన్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు హర్షవర్ధన్ రానే

బంజారాహిల్స్: ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్ అనేది ప్రతి ఒక్కరి శరీరంలో ఒక అవయవంలా మారిపోయిందని బాలీవుడ్, టాలీవుడ్ నటుడు హర్షవర్ధన్ రానే అన్నారు. ఆదివారం ఆయన జూబ్లీహిల్స్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో సామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫోల్డ్7 ఫోన్లను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనునిత్యం టెక్నాలజీలో ఎన్నో మార్పులు వస్తున్నాయని ఆ టెక్నాలజీకి తగ్గట్లుగా ఉన్న గ్యాడ్జెట్లనే ఎక్కువ మంది వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఈవో కరన్ బజాజ్, సామ్‌సంగ్ సౌత్ మార్కెటింగ్ హెడ్ అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతాం


సమావేశంలో పాల్గొన్న అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్ : అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతామని తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. ఆదివారం జరిగిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ కేంద్ర కమిటీ సభ్యుల కార్య నిర్వాహక కమిటీ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ ప్రచారాన్ని పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. అగర్వాల్ సమాజ్ భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. టీంను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి వికాస్ కుమార్ కేశన్, ఉపాధ్యక్షుడు రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదు మిత్రమా..!


బోనాల పండుగలో భాగంగా అమ్మవారి పూజలకు బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: అసలే ఇరుకు గల్లీలు..ఆపై సమయం లేదు.. రాకుంటే ఫీలవుతారేమోనని భయం.. ఉన్న సమయంలోనే నియోజకవర్గం మొత్తం చుట్టి రావాలనే తాపత్రయం..ఇంకేముంది ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇరుకు గల్లీల్లో తన కారు వెళ్లదు కాబట్టి స్కూటర్‌ను ఆశ్రయించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు బైక్‌పై రయ్..రయ్ అంటూ వెళ్లారు. నియోజకవర్గంలోని 90కి పైగా అమ్మవారి ఆలయాల్లో ఆయన బోనాల పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పిలిచిన వారందరి దగ్గరికి వెళ్లి అమ్మవారి సన్నిధిలో అర్చక స్వాములు ఆశీస్సులు తీసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చాలా గల్లీల్లోకి కారులో వెళ్లాలంటే కుదరకపోవడమే కాకుండా సమయం కూడా ఉండదు. దీంతో ఆయన బైక్‌పై అన్ని ప్రాంతాలను చుట్టొచ్చారు.

ఘనంగా చెస్ డే వేడుకలు


చెస్ డే వేడుకల్లో క్రీడాకారులు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో ఆదివారం ఇంటర్నేషనల్ చెస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకాగ్ర చెస్ క్రీడాకారులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏకాగ్ర చెస్ అకాడమీ చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని అత్యంత పిన్న వయస్కుడిగా మూడున్నర సంవత్సరాల రిషి చెస్‌లో తన సత్తా చాటుతున్నాడని అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు తెలిపారు.

జయశంకర్ విగ్రహాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చివేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జయశంకర్ విగ్రహాన్ని పెట్టేందుకు ఏర్పాటు చేసిన గద్దెను కూల్చివేయడం దారుణమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

12378 కార్డుల పంపిణీకి ఏర్పాట్లు!

బాలానగర్: ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రేషన్‌కార్డులు పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రజా పాలన, మీ సేవా కేంద్రాల్లో, వార్డు కార్యాలయాల్లో అర్హులైన వారి నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్డుల కోసం దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. బాలానగర్ కార్యాలయం పరిధిలో కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి మండలాలు ఉన్నాయి. 227 రేషన్ షాపులు ఉన్నాయి. రేషన్ కార్డుల కోసం 29,600 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 360 డిగ్రీల కోణంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి 12,378 మంది అర్హులుగా తేల్చారు. ఇంకా సర్వే కొనసాగుతున్నది. పాత రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు కోసం 38,211 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా పేర్లు చేర్చటం, రేషన్ కార్డులలో పేరు తొలగించడం, నూతన కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని అధికారులు తెలిపారు.

అవయవ దానం చేసే వారిని గౌరవంగా చూడాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అవయవ దానం చేసే వారిని, వారి కుటుంబాలని గౌరవంగా చూసుకోవాలని అప్పుడే వారికి అవయవ దానం చేసిన సంతృప్తి కలుగుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమ్మ ఐ ఆర్గానిక్, బాడీ డోనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పి. సుబ్బరాజు రచించిన జీవన దానం పుస్తకాన్ని జస్టిస్ రాధారాణి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..... తమ కుటుంబంలో కూడా అవయవ దానం చేసామని చెప్పు అవయవ దానాలు తీసుకునేటప్పుడు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులను హస్పిటల్ వారు ఇతరులు గౌరవంగా చూస్తే వారిలో సంతృప్తి కలుగుతుందని ఇతరులు కూడా డోనేట్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. అవయవ దానం ఇతరుల ప్రాణాన్ని కాపాడుతుందని ఇదోక గొప్ప సామాజిక స్పృహ అన్నారు.